

# కర్మయోగం

మాడుగుల కృష్ణకుమారి

మార్తాండుడు పశ్చిమాన ఉదయించి, తూర్పున అస్తమిస్తాడన్నా నమ్మచ్చు కానీ, ప్రాతఃకాలాన్నే గాయత్రీ జపం, విష్ణు సహస్రనామం, రామాయణ పారాయణం వంటి తన అనుష్ఠాన కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వర్తించే వరబ్రహ్మశాస్త్రి ఆ రోజు కోడి కూసి గంటలు గడిచిపోతున్నా కూర్చున్న చోటి నుంచి లేవకుండా ఉండిపోయాడు అంటే అందరూ ముక్కున వేలేసుకున్నారు.

"ఏవండీ ఒంట్లో బాగుండలేదా ఏమిటీ రోజు?" అంది భార్య ఆదిలక్ష్మమ్మ మడినీళ్ళు పడుతూ మధ్యలో వచ్చి.

ఓసారి తలెత్తి భార్య వైపు చూసి మళ్ళీ తల దించుకున్నా రాయన.

గోడమీది నుంచి ఈ వార్తను తల్లి ద్వారా విన్న శాస్త్రిగారిమ్మాయి వైదేహి పక్కింటి నుంచి పరుగున వచ్చి తండ్రిని పలకరించింది.

తల్లి కిచ్చిన సమాధానమే కూతురికీ వచ్చింది.

ఆ పాటికి వీధి అరుగు మీద అనుష్ఠాన కార్యక్రమానంతరం కూర్చునే శాస్త్రిగారి కోసం వచ్చిన నలుగురైదుగురికి కూడా ఏం అంతుపట్టలేదు.

ఇంట్లో వాళ్ళకి తెలిస్తే కదా బయటివాళ్ళకి చెప్పేది!

భర్త వైఖరి అర్థం కాక అన్యమనస్కంగానే పొయ్యి రాజేసింది ఆది లక్ష్మమ్మ.

"ఏం నాన్నా! ఈ రోజు అదోలా ఉన్నారు?" అన్నాడు కొడుకు చంద్రం. కొడుకుని చూడగానే శాస్త్రిగారి వదనంలో ఎన్నో మార్పులు, గుండెల్లో ఏదో అలజడి, కళ్ళల్లో తడి.

"ఇదిగో ఆదిలక్ష్మీ, అబ్బాయికి తలంటి పోసి, ఈ రోజు వాడి కిష్టమైన పిండివంటలు చెయ్యి." ఖంగున మోగిం దాయన స్వరం.

"ఏమిటండి విశేషం? ఈ రోజు వాడి పుట్టిన రోజు కూడా కాదే" అందావిడ.

"చెప్పింది చెయ్యటం నేర్చుకో" అన్నారాయన కోపంగా.

క్రితం రోజు తండ్రి తనను ఆఫీసుకు ఎందుకు సెలవు పెట్టమన్నా డన్నది ఎంత ఆలోచించినా అర్థం కాలేదు చంద్రానికి.

ఎదురు చెప్పకుండా తండ్రి చెప్పినట్లుగా సెలవు పెట్టాడు.

భర్తకు ఎదురు చెప్పే అలవాటు లేని ఆదిలక్ష్మమ్మ కొడుక్కి తలంటి అతని కిష్టమైన పిండివంటలు, కూరలు చేసింది.

బలవంతాన ఎవరో లేవదీసినట్లుగా లేచి స్నానం ముగించా రాయన. భర్తకు, కొడుక్కి వడ్డించింది ఆదిలక్ష్మమ్మ.

ఔపోసన పట్టటం కూడా మరిచిపోయి, ముందుగా ఓ ముద్ద వదిలి పెట్టే శాస్త్రిగారు దైనందిన కార్యక్రమానికి భిన్నంగా అన్నంలో చెయ్యిపెట్టి కలిపేసుకున్నారు.

అసంకల్పిత ప్రతీకార చర్యలా చెయ్యి నోటి దగ్గరకు వెడుతోందన్న మాటేగానీ, ఏం తింటున్నదీ ఎలా ఉన్నదీ ఆయన మనసుకు పట్టటం లేదు.

భర్త చర్య విడ్డూర మనిపించినా నోరెత్తే ధైర్యం లేని ఆదిలక్ష్మమ్మ మిన్నకుండిపోయింది.

అన్య మనస్కంగానే భోజనం ముగించారు శాస్త్రిగారు.

సెకన్లు నిమిషాలుగా, నిమిషాలు గంటల్లా గడిచిపోతుంటే ఆయన గుండె మరింతగా బిక్కపట్టినట్లుగా ఉంది. ఎప్పుడూ తనని చూడనట్లుగాను, ఎన్నాళ్ళ తర్వాతో చూసినట్లుగాను ఉన్న తండ్రి చూపులకు అర్థం తెలియ లేదు చంద్రానికి.

కొడుకుని చూస్తుంటే దుఃఖం పొంగుకు వస్తోం దాయనకు. ఎవరితో చెప్పి ఈ బాధను దింపుకోగలడు? చెపితే విని భరించే శక్తి వాళ్ళకుందా? రేపీపాటికి ఇంట్లో... ఆ ఊహే భరించ శక్యంగా లేదు శాస్త్రిగారి.

సాయంకాలం తనకు కొత్త బట్టలు ఇస్తున్న తండ్రిని- "ఎందుకునాన్నా?" అని అడగాలనిపించినా ఆయన వైఖరి రోజులా లేకపోవటంతో నోరు ఎత్తలేదు చంద్రం.

కొత్త బట్టలతో తనకి నమస్కరిస్తున్న కొడుకుని

"దీర్ఘాయుష్మాన్ భవా" అని దీవిస్తుంటే ఆయన గొంతు వణికింది.

"అలా గుడిదాకా వెళ్ళొద్దాం రా నాన్నా" అన్నారు కొడుకుని.

భర్త చేస్తున్న పనిలో ఏ ఒక్కటీ కూడా అర్థం కాలేదు ఆదిలక్ష్మమ్మకి. తండ్రితో పాటుగా ప్రదక్షిణాలు చేసి దైవ దర్శనానంతరం తెలిసిన మిత్రుడు కనిపించటంతో మాట్లాడి వస్తానని వెళ్ళాడు చంద్రం.

గుడిమెట్ల మీద కూర్చున్న శాస్త్రిగారికి దూరంగా ఉన్న కొడుకు రూపం చీకటి ముసరటంతో అంతకంతకు అస్పష్టమవసాగింది.

రేపీపాటికి.

ఆయన కళ్ళు జలపాతాలే అయ్యాయి.

"ఒరేయ్ పరబ్రహ్మాం" అన్న పిలుపు విని తలెత్తారు.

ఎదురుగా తన మిత్రుడు గోవర్ధనం కనిపించాడు.

"ఏమిట్రా అలా ఉన్నావు? ఆ కన్నీరేమిటి? ముఖమలా వాడి పోయిందేమిటి? ఏమైందసలు?" అని ఆప్యాయంగా అడుగుతూ పక్కనే కూర్చున్నా డాయన.

ఆ ఆప్యాయతకు గుండెల్లోని బాధ తన్నుకు వచ్చింది శాస్త్రిగార్కి. శాస్త్రిగారి ఒక్కగా నొక్క కొడుకు చంద్రం. మర్నాటి శుభోదయం చూడడని, అతనికి మారకదశ ఉన్నదని విన్న గోవర్ధనం అవాక్కయిపోయాడు.

పదినిముషాల తర్వాత తేరుకుని "మరి శాస్త్రం చదువుకున్న వాడివి దానికి విరుగుడు ఏదన్నా చెయ్యలేక పోయావు?" అన్నాడు.

"ఏం చేసినా ప్రయోజనం లేదురా. వాడికి ఇరవైనాలుగు నిండిన అర్నెల్లు ఆరు రోజులకు చంద్రాస్తమాన సమయానికి తప్పదు- అది వాడి జాతకంలోని గ్రహాలు చెపుతున్నాయి" అన్నాడు గద్గదంగా.

పరబ్రహ్మ శాస్త్రి చెయ్యి చూసి చెప్పాడంటే అక్షరాలా అయితీరుతుంది. అందుకే ఆయన కా ఊళ్ళోనే కాదు- చుట్టుపక్కల కూడా పెద్దపేరు.

పరబ్రహ్మ శాస్త్రిగారి తండ్రి అనంతరామ్మూర్తి సిద్ధాంతి వైకుంఠ ఏకాదశినాడు అందరికీ జాగ్రత్తలు చెప్పి చాపేసుకుని పడుకుని మరీ ప్రాణం వదిలా డాయన. అలాటి మనిషి కడుపున పుట్టిన పరబ్రహ్మాని కీ రోజు ఎంత కష్టం రాబోతోంది.

ఆరుగురు ఆడపిల్లల తర్వాత పుట్టిన ఒక్కగా నొక్క కొడుకు చంద్రం. వాడంటే ప్రాణం బ్రహ్మానికి.

"తప్పదంటావురా?" అన్నాడు గోవర్ధనం.

కండువాతో కన్నీటిని అద్దుకుంటూనే "విధి రాత తప్పించటం ఆ బ్రహ్మ తరం కూడా కాదురా. నా చేతిలో కర్మయోగం ఉంది. వాడి చేతిమీదుగా దాటిపోవాలనుకున్న నా చేతి మీదుగా వాడ్ని"-గొంతు పెగల్లే దాయనకు దుఃఖంతో.

"చూడు శాస్త్రీ! ఈ పరిస్థితిలో నువ్వు ధైర్యంగా ఉండాలి. ఏం చేస్తాం చెప్పు? ఋణాను బంధు రూపేణా పశుపత్నీ సుతాలయాః అని సరిపెట్టు కోవాలి మరి. ఇంకోకటి-ఇంకొకటీ కాదయ్యే జరక్కపోవటానికి, ఇదీ నీ జాతకం. నువ్వే ఇలా బేలవయిపోతే మిగతా వాళ్ళ సంగతేమిటి చెప్పు? గీతలో కృష్ణ పరమాత్మ చెప్పినట్లుగా సుఖమైనా, కష్టమైనా కాలానుసారంగా జరగిపోవలసిందే.



జరిగేది జరక్కమానదు, కనుక ముందుగానే చెప్పి అందర్నీ బెదరగొట్టకు. రేపు ఉదయం నేను వస్తానుగా. అదిగో చంద్రం వస్తున్నాడు మామూలుగా ఉండు" అన్నాడు ఓదార్పుగా స్నేహితుడి భుజాన చెయ్యివేసి.

కొడుకు రావటంతో ఇంటికి బయలుదేరాడు శాస్త్రి భారంగా. నూనుగు మీసాల వయస్సులో సుందరమైన ముందరి భవిష్యత్తును చూడకుండానే వెళ్ళిపోతున్నాడు చంద్రం.

క్షణంలో ఘోరవిపత్తు జరుగుతుంది అని తెలిస్తే మనిషికి ఎంత బాధ. తెలియకపోతే ఏ బాధా ఉండదు. ఈ జ్యోతిశ్శాస్త్రాన్ని క్షుణ్ణంగా చదవకపోయినా బాగుండేది. ముందుగానే ఇంత బాధను అనుభవించకుండా ఉండేవాడు.

"పాపం పరబ్రహ్మాం" అనుకున్నాడు గోవర్ధనం బాధగా. ఆ రాత్రి కొడుకుపక్కనే పడుకునాడన్నమాటే కానీ నిద్ర పడితే ఒట్టు శాస్త్రిగారికి.

మాట్లాడి-మాట్లాడి నిద్రలోకి జారిపోయాడు చంద్రం. రేపీపాటికీ రూపం తనకు కన్పడదనుకున్న అలోచన శాస్త్రి గుండెను తవ్వేస్తోంది. ఉపనయనమైన కొడుక్కి పెళ్ళి చెయ్యాలని తలపోస్తాడు కన్న తండ్రి. ఆ శుభ కార్యం చేసే యోగం తనకు లేకపోగా ఇక నుంచి నెలనెలా ప్రాచీనావీతి అంటూ జంధ్యాన్ని అపసవ్యం చేసుకోక తప్పేట్టు లెదు. ఏ జన్మలో ఏం పాపం చేశాడో తన కీ జన్మలో ఈ రాత రాశా డో దేముడు.

తెల్లవారి లేవగానే ఎదుర్కొనే సంఘటల్ని తల్చుకుంటూ భయంగానూ, బాధగానూ ఆలోచిస్తునే గోడకు అనుకున్న శాస్త్రిగారు ఎప్పటికో కలత నిద్రలోకి జారిపోయారు.

* * * *

తెల్లవారింది. పరబ్రహ్మ శాస్త్రి గారింట్లో అందరూ ఘొల్లుమన్నారు. రావలసిన వాళ్ళందరు వచ్చారు. తేవలసిన సామాన్లు తెచ్చారు. ఈ విషయం విన్న వాళ్ళందరూ ముక్కున వేలేసుకున్నారు. మరి కాసేపటికి శవానికి స్నానం చేయించి పాడె సిద్ధం చేశారు. పాడె బయలు దేరింది.

పాడె మీద ఏ బాధ లేనట్లుగా పరబ్రహ్మశాస్త్రి ప్రశాంతంగా పడుకున్నాడు. శవం ముందు నీళ్ళోడుతున్న తడి బట్టలతో నిప్పుల కుండ పట్టుకుని నడుస్తున్నాడు శాస్త్రిగారబ్బాయి చంద్రం విషాదవదనంతో.

"పెరటి చెట్టు వైద్యానికి పనికిరాదన్నట్టుగా ఊరందరికీ జాతకం చెప్పే శాస్త్రి తన గురించి తాను తెలుసుకోలేక పొయ్యాడు. పిచ్చి మనిషి!" కన్నీటితో శవం వెనుక నడుస్తున్న గోవర్ధనం తనలో తనే అనుకున్నాడీ మాటలను. ★

## న్యాయదర్శనం

### మహిళా కానిస్టేబుల్ కేసులో హైకోర్టు తీర్పు

ప్రేమ్‌దేవి మహిళా కానిస్టేబుల్‌గా చేరింది. ప్రతి సంవత్సరం లోయరు స్కూలు కోర్సు చేయడానికి కానిస్టేబుల్స్‌ను పంపుతుంది డిపార్ట్‌మెంటు. అది ఆరు నెలల కోర్సు, ఏప్రియల్‌లోను, తిరిగి అక్టోబరులోను నిర్వహిస్తారు. సంవత్సరానికి ఒకసారి పరీక్ష పెడతారు. అందులో పాసయిన వారి నుంచి సెలెక్ట్ చేసి ఈ కోర్సుకు పంపుతారు. ప్రతి జిల్లా స్థాయిలో ఈ పరీక్ష జరుగుతుంది. మహిళలకు కొంత కోటా ఉంది.

1987 వ సంవత్సరానికి గాను పరీక్షలు నిర్వహించారు. మగ, ఆడ పోలీసులకు కలిపి జాయింట్ పరీక్ష పెట్టారు. ప్రేమ్‌దేవి మహిళలలో మొదటి రాంకులోను, జాయింట్ లిస్టులో 11 వ రాంకులోను పాసయింది. ఆమెను ఏప్రియల్‌లో మొదలయ్యే కోర్సుకు పంపలేదు. కారణం చెప్పలేదు. ఆమెకు అనుమానం వచ్చింది. అక్టోబరు కోర్సుకు కూడా పంపరేమోననే భయంతో హైకోర్టులో రిట్ వేసింది. తనను కోర్సుకు పంపవలసిందిగా పోలీస్ అధికారులను ఆదేశించమని కోరింది.

ఆమె మెరిట్ లిస్టులో ఉన్నమాట నిజమే కానీ గవర్నమెంటు 1987 - 88 సంవత్సరంలో జరిగే కోర్సులలో ఆడ పోలీసుల కొరకు సీట్లను కేటాయించనందువల్ల పంపడానికి వీలుపడలేదని డిపార్ట్‌మెంటు సమాధానం ఇచ్చింది. ఈలోగా అక్టోబరు వచ్చింది. కోర్టు నుంచి తాత్కాలిక ఉత్తర్వులు తీసుకుని ఆమె కోర్సులో చేరింది.

మహిళా కానిస్టేబుల్స్ కొరకు సీట్లు లేకపోతే వారికి అసలు పరీక్షే పెట్టకుండా ఉండవలసిందని, పరీక్ష పెట్టి మెరిట్‌లో వచ్చిన తరువాత సీట్లు కేటాయించలేదు కనుక కోర్సుకు పంపడం లేదని చెప్పడం తప్పని, పైగా రాజ్యాంగంలోని 15 [3] వ అధికరణం స్త్రీల కొరకు ప్రత్యేకమయిన సదుపాయాలు కల్పించాలని చెబుతోందని, అందుచేత ఆమెను అక్టోబరు కోర్సుకు పంపినట్లేనని - అది పూర్తి చేయనివ్వాలని - కోర్సు పూర్తి అయిన తరువాత ఇచ్చే ప్రయోజనాలన్నింటినీ ఆమెకు ఇవ్వవలసిందని ఆదేశించింది అలహాబాద్ హైకోర్టు

-ఎమ్. ఎస్. శర్మ